సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 2 । నవంబర్ । 2024



తణుకులో వ్యక్తి దారుణ హత్య

తణుకు పట్టణంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కాకర్ల దుర్గారావును హత్య చేశారు. 8లో ▸



బీచ్‌కి వెళ్లొద్దామా..

ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రపు అలలు.. కనువిందు చేసే సూర్యోదయ, సూర్యాస్తమయాలతో పేరుపాలెం మండలంలో బీచ్‌లు స్వాగతం పలుకుతున్నాయి. 8లో ▸



చెస్ రేటింగ్‌లో క్రీడాకారులు

భీమవరానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించారు. శరణ్, జాసిత్‌వర్మ, శివకార్తీక్ ఈ ఘనత సొంతం చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ సన్నిధిలో ఉప లోకాయుక్త



ఉప లోకాయుక్త రంజని దంపతులకు అమ్మవారి ఫొటోను అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త పి.రజని దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ వారికి ప్రసాదాలు, శేషవస్త్రం, అమ్మవారి ఫొటో అందజేశారు. డీఎస్పీ జయసూర్య, తహసీల్దార్ రాంబాబు ఉన్నారు.

సుదీర్ఘ కాల సేవలు అభినందనీయం



పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం బాధ్యతాయుతంగా సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. తాడేపల్లిగూడెం టౌన్ స్టేషన్‌లో ఏఎస్సై బీవీఎస్ ప్రభాకరరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సింహాద్రి అప్పన్న పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ మాట్లాడుతూ అంకిత భావంతో అందించిన సేవలను పోలీసు శాఖ గుర్తించుకుంటుందని, పదవీ విరమణ బెనిఫిట్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

8 నుంచి ప్రజాపోరు

భీమవరం: అధిక ధరలు, నిరుద్యోగం, అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్ చెప్పారు. శుక్రవారం భీమవరంలో చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14న ఎంపీడీఓ కార్యాలయాలు, 15న కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ ఇసుక కొరత, మద్యం షాపులు, విద్యుత్ ట్రూఅప్ చార్జీలపై ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతులు, పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లతో పేదలకు భరోసా



పింఛన్ అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: సామాజిక పింఛన్లు పేదలకు భరోసాగా నిలుస్తున్నాయని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిమితమై మంచానికే పరిమితమైన పాలపర్తి ప్రకాశం, దివ్యాంగురాలు పాలపర్తి సోమాలమ్మ, వృద్ధులు మద్దా రామారావు, మూరా జయరాజు, వితంతువు ముళ్లగిరి దీనమ్మకు పింఛన్ సొమ్ములు అందజేశారు. జిల్లాలో 2.33 లక్షల పింఛన్‌దారులకు రూ.96 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ ఎం వేణుగోపాల్, ఏపీఓ పింఛన్స్ టి.మురళీకృష్ణ, డీఎస్‌ఓ ఎన్.సరోజ, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర పాల్గొన్నారు.

దీపం–2 ప్రారంభం

పాలకొల్లు అర్బన్: దీపం–2 పథకంలో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. మండలంలోని పూలపల్లిలో శుక్రవారం దీపం–2 పథకాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. జిల్లాలో 4.63 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో దీపం–2 కార్యక్రమాలు జరిగాయి.

శివోహం.. భజేహం

కార్తీకం.. పరమ పవిత్రం

- మోక్షధామాలుగా పంచారామాలు
- ఉమ్మడి జిల్లాలో శైవ క్షేత్రాల ముస్తాబు
- కార్తీక మాసోత్సవాలు ప్రారంభం
- క్షేత్రాల్లో దర్శన వేళల పొడిగింపు
- ప్రత్యేక సర్వీసులకు ఆర్టీసీ సన్నద్ధం



పాలకొల్లులో కాంతులీనుతున్న క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం



భీమవరంలో సోమేశ్వరుడు



పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరుడు

సాక్షి, భీమవరం: హరహర మహాదేవ.. శంభో శంకర స్మరణలు మార్మోగుతున్నాయి.. పరమ పవిత్ర కార్తీక మాసోత్సవాలకు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. కార్తీకమాసం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పంచారామ భీమవరంలోని సోమారామం, పాలకొల్లులోని క్షీరారామంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ముక్కంటిని దర్శించుకోనున్నారు. దీపావళి మరుసటి రోజు నుంచి కార్తీకమాసం మొదలవుతుంది. గురువారం దీపావళిని జరుపుకోగా ఈ ఏడాది శుక్రవారం ఉదయం కూడా అమావాస్య ఘడియలు ఉండటంతో వేదపండితుల సూచనల మేరకు శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేకువ జామునే స్నానాలు చేసి దీపారాధన చేయడం ద్వారా కార్తీక దామోదరునికి భక్తులు పూజలు చేస్తారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, లక్ష బిల్వార్చనలు, దీపాలంకరణ సేవలు తదితర విశేష పూజలకు భక్తులు సన్నద్ధమయ్యారు.


సోమారామం.. క్షీరారామం

పంచారామాల్లోని రెండు ప్రధాన ఆలయాలతో జిల్లా పేరొందింది. భీమవరంలో ఉమా సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం (సోమారామం), పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం) ఉన్నాయి. సోమారామంలోని శివలింగం చంద్ర ప్రతిష్టగా ప్రతీతి. 9వ శతాబ్దంలో తూర్పుచాళుక్య రాజు చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించాడు. అమావాస్య రోజున గోధుమ, నలుపు వర్ణంలో, పౌర్ణమికి శ్వేతవర్ణంలోకి మారడం ఇక్కడి శివలింగం ప్రత్యేకత. పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం పంచ లింగాలు, పంచ శిఖరాలు, పంచ నందులు, పంచ గణపతులు, పంచ అమ్మవార్లతో పంచాయతన ఆలయంగా ఖ్యాతి గాంచింది. ఇక్కడ స్వామి దర్శనానికి ఐదు ద్వారాలు దాటి వెళ్లాలి. కార్తీక మాసంలో భక్తులతో పాటు పంచారామాల సందర్శకులతో ఈ క్షేత్రాలు కిటకిటలాడతాయి. కార్తీక సోమ, ఆదివారాలు, కార్తీక పౌర్ణమి, మాసశివరాత్రి పర్వదినాల్లో 30 వేల మందికి పైగా భక్తులు తరలివస్తుంటారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాలకు చెందిన వారితో పాటు తెలంగాణ నుంచి పంచారామ యాత్రికులు ఇక్కడకు వస్తుంటారు.

చలువ పందిళ్లు.. విద్యుత్ కాంతులు

పంచారామ క్షేత్రాల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100 ప్రత్యేక దర్శనాల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా సోమవారాలు, ప్రత్యేక పర్వదినాల్లో వేకువజాము 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారిని దర్శించుకునే సౌకర్యం కల్పించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. అభిషేకాలు, కార్తీక నోములు నోచుకునే భక్తులకు సోమారామంలో ఆలయం వెనుక ఏర్పాట్లు చేశారు. క్షీరారామంలో వేకువజామున కార్తీక దీపాలు వెలిగించేందుకు, దీప, ఉసిరి, సాలగ్రామ, వస్త్ర, గోదానాలు ఇచ్చే భక్తుల కోసం ఆలయ ఉత్తర భాగంలో గోశాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీకమాసం నెల రోజులూ రెండు ఆలయాల వద్ద భక్తులకు నిత్యాన్నదాన సదుపాయం కల్పించారు.

సర్వం సిద్ధం



కార్తీకమాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేక రోజుల్లో 30 వేల మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఈ రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేశాం. క్యూలైన్లు, వాహనాలకు పార్కింగ్, ఇతర సదుపాయాలు కల్పించాం. శనివారం నుంచి ఆలయం వద్ద నిత్యాన్నదానం మొదలవుతుంది.

– రామకృష్ణంరాజు, సోమారామం ఈఓ, భీమవరం

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. రైతు సేవ కేంద్రాల పరిధిలో కనీసం 20 శాతం తగ్గకుండా గోనె సంచులను నిల్వ ఉంచాలన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. ప్రతి కేంద్రం పరిధిలో పంట కోత షెడ్యూల్ తయారు చేసుకుని ఎప్పటికప్పుడు గోనె సంచులను రవాణా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గాల స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే ముందు సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎంఎల్‌ఓ పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సులతో భవిత

పాలకొల్లు అర్బన్: సాంకేతిక విద్యపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, పదో తరగతి తర్వాత ఏ కోర్సులు అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందో తెలుసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. మండలంలోని శివదేవుని చిక్కాల జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల పురోగతిని తెలుసుకున్నారు. వృత్తి నైపుణ్య కోర్సులపై శ్రద్ధ చూపాలన్నారు. టెన్త్ విద్యార్థులకు లెక్కలు బోధించారు. హెచ్‌ఎం పి.రాము ఉన్నారు.

నిధుల స్వాహాపై విచారణ

సాక్షి స్పందన

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా వాస్తవమేనని ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఓ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. అక్టోబర్ 31న 'ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. ఆస్పత్రిలో కుంచె మురళీ తులసీదర్ అనే వ్యక్తి 2021 నుంచి పనిచేస్తున్నారని, ఇంతకు ముందు, ప్రస్తుత సూపరింటెండెంట్ల సంతకాలు ఫోర్జరీ చేసి ఆరోగ్యశ్రీ నిధులు దారి మళ్లించారన్నారు. దీనిపై పాలకొల్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. అలాగే జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయ అధికారి (ఏలూరు) శుక్రవారం శాఖాపరమైన విచారణకు ఆదేశించారని ఆయన అన్నారు.

'అపార్'పై ఒత్తిడి తగదు

భీమవరం: విద్యార్థులందరికీ రాష్ట్ర ప్రభుత్వం అపార్ ఐడీలను నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం దారుణమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు ఐడీ నంబర్ క్రియేట్ చేసేందుకు అడ్మిషన్ బుక్, యూడైస్, ఆధార్ కార్డులో ఒకే పేరు, ఒకే అక్షరం ఉండాలని అయితే ఆధార్ కార్డులో పేర్లు, పుట్టిన తేదీ, ఇంటిపేరు తప్పులుండటం వల్ల ఐడీ క్రియేషన్ ఆలస్యమవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆధార్ కార్డులో తప్పులు సరిచేయించడం కోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లడంతో పిల్లలు బడులు మానేస్తున్నారని పేర్కొన్నారు.

అసమర్థ పాలకుడు చంద్రబాబు

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ మాత్రం సంక్షేమం అందించలేని అసమర్థ పాలకుడని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఘాటుగా విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళిని ప్రజలు అసంతృప్తిగా నిర్వహించుకోవడం బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా.. సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, జగన్ ప్రభుత్వంలో ధరలకు, కూటమి ప్రభుత్వంలో ధరలకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.4,800 కోట్ల పాత విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపడం దారుణమని అన్నారు. ఐదు నెలల్లోనే రూ.59 వేల కోట్లు అప్పు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని, ఆరోగ్యశ్రీ పథకాన్ని అధోగతిపాలు చేశారని, 108 సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

మాటలు నమ్మి మోసపోయిన జనం

ఇసుక ఉచితమని చెప్పి ఇప్పుడు ఆరు యూనిట్లకు సుమారు రూ.15 వేలు, మూడు యూనిట్లకు రూ.11 వేలు వసూలు చేస్తున్నారని కొట్టు విమర్శించారు. ఇసుక కొనలేక నిర్మాణాలు నిలిచిపోతే కూలీలు పనులు లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నేతల తేనె పూసిన కత్తి మాటలు విని ప్రజలు అధోగతి పాలయ్యారన్నారు. లిక్కర్ క్వార్టర్ బాటిల్ రూ.99కే అని చెప్పి ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. బెల్టు షాపులకు వేలం పాటలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. విజయవాడ వరదల సమయంలో చంద్రబాబుకు అందిన విరాళాల వివరాలు వెల్లడించకపోవడం అవినీతికి తార్కాణమని కొట్టు అన్నారు. మంచినీటి బాటిళ్లకు రూ.26.80 కోట్లు, కొవ్వొత్తులకు, అగ్గిపెట్టెలకు రూ.23 కోట్లు ఖర్చయిందని చెప్పడం దోపిడీతనాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్

పాలనపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో తిరుపతి లడ్డూ ప్రసాదంపై అసత్య ప్రచారం చేశారని కొట్టు మండిపడ్డారు. తిరుమల తిరుపతికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నానని చెప్పిన వ్యక్తికి చైర్మన్ పదవిని ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.

ఆ పాపం చంద్రబాబుదే

జగన్ కుటుంబంలో చిచ్చు పెట్టి కుటుంబాన్ని విడదీసిన పాపం చంద్రబాబుకే దక్కుతుందని కొట్టు అన్నారు. చెల్లి మీద అభిమానంతో తండ్రి ఉన్న సమయం నుంచి ఇప్పటివరకు ఆస్తిలో వాటాను ఇచ్చిన అభిమాన అన్నగా జగన్ నిలిచారన్నారు. అన్నపై తప్పుడు కేసులు పెట్టించిన వ్యక్తితో అంటకాగడం షర్మిలకు సరికాదని మంత్రి కొట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి చంద్రబాబు ఏమి చెప్పమంటే అదే మాటలు ప్రజలకు వల్లె వేయడం అతని అనైతికతకు తార్కాణమన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్మించడం ఎందుకని ప్రశ్నించారు. కూటమి పాలనకు ప్రజలు గుణపాఠం చెబుతారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.

విద్యుత్ మీటర్లు తొలగించడం దారుణం

బుట్టాయగూడెం: బకాయిల పేరుతో దళితుల ఇళ్లల్లో విద్యుత్ మీటర్లు తొలగించడం దుర్మార్గమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి అన్నారు. మండలంలో విద్యుత్ అధికారులు మీటర్లు పీకివేసిన దళితుల ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అని చెబుతూనే మరో వైపు మీటర్లు తొలగించడం దారుణమన్నారు. బాధ్యులపై అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలన్నారు. ప్రతి ఆరు నెలలకూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ నిర్వహించాలన్నారు. విద్యుత్ మీటర్లు తొలగించిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, మొగలి గంగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో బదిలీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఏఈలు బదిలీ అయ్యారు. దెందులూరు ఏఈ ఎం.రమేష్‌బాబును ఉండ్రాజవరం ఏఈగా, నిడమర్రు ఆపరేషన్స్ ఏఈ ఎన్.మురళీకృష్ణను వేలేరుపాడు ఆపరేషన్స్ ఏఈగా బదిలీ చేశారు.

● ఏడిపింఛెన్



ఏలూరు 40వ డివిజన్ సచివాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు



పెంటపాడు మండలం ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ఎదురుచూస్తూ..

సామాజిక పింఛన్ల కోసం లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా ఏదో ఒక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. శుక్రవారం ఉదయం గంటలోనే సాంకేతిక సమస్యతో యాప్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు పరుగులు తీశారు. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు అక్కడే పడిగాపులు కాశారు. గత జగన్ పాలనలో వలంటీర్ల ద్వారా వేకువజామునే పింఛన్లు అందేవని గుర్తు చేసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు, పెంటపాడు

చటాకాయలో అరాచకం

- చేతబడి నెపంతో ముగ్గురిపై దాడి
- స్తంభానికి కట్టి పైశాచికానందం
- కొల్లేరు గ్రామాల్లో సమాంతర పాలన
- పంచాయితీల మాటున దారుణాలు



రక్షణ కల్పించాలంటున్న రఘు దంపతులు





చికిత్స పొందుతున్న మోరు రాంబాబు, ధనుంజయ

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో మూఢనమ్మకాల మాటున అరాచకాలు సాగుతున్నాయి. ప్రభుత్వానికి సమాంతరంగా పెద్దల మాటున పంచాయితీలు కొనసాగుతున్నాయి. కైకలూరు మండలం చటాకాయ గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో ముగ్గురిని చేతబడి నెపంతో స్తంభాలకు కట్టి 18 మంది కర్రలతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ ఉప సర్పంచ్ భర్త ఘంటసాల చినసుబ్బరాజుకు నీటి కాల్వపై కాపలా ఉండే సైదు రఘునకు నెల రోజుల క్రితం నీటి తూముల విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న గ్రామంలో పెద్దల వద్ద సుబ్బరాజు పంచాయితీ పెట్టి రఘు చేతబడులు చేస్తున్నాడని ఆరోపించాడు. దీంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రఘును స్తంభానికి కట్టి కర్రలతో చితకబాదారు. ఆ సమయంలో రఘు భార్య మంగతాయారు అడ్డురాగా ఆమెనూ ఈడ్చిపడేశారు. పెట్రోలు పోసి తగలబెడతామని బెదిరించడంతో రఘు ప్రాణభయంతో చేతబడిలో తనతో పాటు మోరు రాంబాబు, జయమంగళ ధనుంజయ, మరో ఏడుగురు ఉన్నారని చెప్పాడు. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. దీంతో ఆగ్రహించిన పెద్దలు రఘుతో పాటు రాంబాబు, ధనుంజయను స్తంభాలకు కట్టి అదేరోజు రాత్రి 8 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు చిత్రహింసలకు గురిచేశారు. తీవ్రగాయాలైన రాంబాబు, ధనుంజయ ఏలూరులో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా.. రఘు ఈనెల 26న భార్యను తీసుకుని ద్విచక్రవాహనంపై పారిపోయాడు. సీఎం చంద్రబాబు నివాసం, సచివాలయం, మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఏలూరు ఎస్పీ శివకిషోర్ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. అనంతరం సైదు రఘు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి జరిగిన విషయాన్ని కైకలూరు పోలీసులకు చెప్పాడు. దీంతో చటాకాయ గ్రామస్తులు ఘంటసాల చినసుబ్బరాజు, దేశింగిరాజు, కుటుంబరావు, ముంగర గంగాధరరావు, బలే చంద్రయ్య, శ్రీవేంకటేశ్వర్లుపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 29న కేసు నమోదు చేశారు.

రక్షణ కల్పించాలని వినతి

తమకు గ్రామంలో రక్షణ లేదని, రాజీ ప్రయత్నాలకు పెద్దలు వస్తున్నారని, తమకు హాని తలపెట్టిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితులు రఘు, మంగతాయారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో ఉన్న రాంబాబు, ధనుంజయ వైద్యం ఖర్చులు భరిస్తామన్న గ్రామ పెద్దలు ఇప్పుడు తమకు సంబంధం లేదని అంటున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏలూరు ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య రిపోర్టులు కీలకంగా మారాయని, చటాకాయ గ్రామంలో పోలీసు అధికారులు రాత్రి నిద్ర చేసి పెద్దలతో మాట్లాడారని ఎస్సై వి.రాంబాబు తెలిపారు. తప్పు చేసిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుందని ఆయన అన్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు నాగేంద్రసాయి ఎంపిక



నాగేంద్రసాయిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయ స్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీలకు భీమవరం భాష్యం స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కూండ్రపు నాగేంద్రసాయి ఎంపికయ్యాడని స్కూల్ జెడ్‌ఈఓ శ్రీమన్నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కె.హనుమంతరావు తెలిపారు. నాగేంద్రసాయిని శుక్రవారం స్కూల్లో అభినందించారు. గతనెల 26 నుంచి మూడు రోజులుపాటు తెనాలి డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్–14 హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు నుంచి నాగేంద్రసాయి ఎంపికయ్యాడని తెలిపారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఈనెల 26 నుంచి నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ స్టేట్ అండర్–14 హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని వివరించారు.

నరసాపురంలో రెండిళ్లలో చోరీ

నరసాపురం: నరసాపురంలో దీపావళి ముందురోజు దొంగలు రెచ్చిపోయారు. ఒకే వార్డులో రెండు ఇళ్లలో చోరీ చేశారు. స్థానిక 18వ వార్డులో కేసరి అర్జునరావు బంధువుల ఇంటికి విశాఖపట్టణం వెళ్లారు. గురువారం ఉదయం ఇంటకి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. 340 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు అర్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై ముత్యాలరావు తెలిపారు. అదే వార్డుకు చెందిన కొండా శ్రీధర్‌కు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.7 వేలు, అరకిలో వెండి వస్తువులు దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. బాధితులు బంగారు వస్తువులు కూడా పోయినట్టు చెబుతున్నారు.

కుమారుని కుటుంబీకులపై బైండోవర్ కేసు

అత్తిలి: వరిఘేడు గ్రామానికి చెందిన వృద్ధులైన తల్లిదండ్రులను ఇబ్బందిపెడుతున్న కుమారుడు తుపాకుల భీమయ్య, కోడలు లక్ష్మి, మనుమడు ఆంజనేయులుపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు తహసీల్దార్ దశిక వంశీ శుక్రవారం తెలిపారు. అత్తిలి పోలీస్ స్టేషన్ ఎస్సై పి.ప్రేమరాజు అందజేసిన పిటిషన్ మేరకు వరిఘేడుకు చెందిన వృద్ధులైన తల్లిదండ్రులు తుపాకుల కొండయ్య, గోపమ్మలను కుమారుడు కుటుంబ సభ్యులు సక్రమంగా చూడకపోవడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై అత్తిలి ఎస్సై తహసీల్దార్ కోర్టులో బైండోవర్ కేసును దాఖలు చేశారు. తహసీల్దార్ వంశీ, భీమయ్య కుటుంబ సభ్యులను కార్యాలయానికి రప్పించి తల్లిదండ్రులను సక్రమంగా చూసేలా షూరిటీ పత్రాలు స్వీకరించారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

యలమంచిలి: అడవిపాలెం వద్ద పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న పంట కాల్వలో పాలకొల్లు బ్రాడీపేటకు చెందిన గొర్రెల గుర్నాథం (44) మృతదేహం లభ్యమైంది. అనుమాదాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. కూలి చేసుకునే గుర్నాథం రోజూ మాదిరిగానే గురువారం ఉదయం పని కోసం ఇంటి నుంచి వచ్చి రాత్రికి కూడా ఇంటికి వెళ్లలేదు. దీంతో అతని ఆచూకీ కోసం గాలిస్తుండగా శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో పంట కాల్వలో మృతదేహం లభ్యమైంది. గుర్నాథంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై గుర్రయ్య తెలిపారు.

బీచ్‌కి వెళ్లొద్దామా..

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- పర్యాటకులను స్వాగతిస్తున్న పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి (ఫైల్)

మొగల్తూరు: ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్రపు అలలు. కనువిందు చేసే సూర్యోదయ, సూర్యాస్తమయాలు. రివ్వున వీచే గాలులు, సరుగుడు, కొబ్బరి తోటల అందాలతో బీచ్‌లు పర్యాటకులకు స్వాగతం పలుకుతున్నాయి. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పేరుపాలెం, కేపీ పాలెం బీచ్‌లు పర్యాటకులతో కిటకిటలాడనున్నాయి. నిత్యం వందలాది మంది పర్యాటకులు బీచ్‌లకు వస్తుంటారు. ఇక ఆది, బుధవారాల్లో వేలాది మంది బీచ్‌లను సందర్శిస్తుంటారు.

ఇలా చేరుకోవచ్చు

భీమవరం నుంచి వచ్చే పర్యాటకులు వెంప, వారతిప్ప, ముత్యాలపల్లి పేరుపాలెం మీదుగా బీచ్‌లకు చేరుకోవచ్చు. నరసాపురం నుంచి వచ్చే పర్యాటకులు సీతారాంపురం, రామన్నపాలెం, పసలదీవి, తూర్పుతాళ్లు మీదుగా బీచ్‌లకు రావచ్చు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆటోలు, బస్సులు, లారీలు, కార్లలో సందర్శకులు బీచ్‌లకు తరలివస్తారు.

టోల్‌గేట్ వసూలు రద్దు

బీచ్‌లకు వచ్చే పర్యాటకుల వాహనాల నుంచి టోల్‌గేట్ వసూలు రద్దు చేస్తున్నట్టు ఎంపీడీఓ త్రిశూల పాణి తెలిపారు. ఈ ఏడాది బీచ్‌లకు వచ్చే పర్యాటకుల వాహనాల నుంచి టోల్‌గేట్ వసూలు చేయరాదని అధికారులు ఆదేశించినట్టు చెప్పారు.

ప్రత్యేకతలు

కార్తీక విహారానికి తరలివచ్చే పర్యాటకులకు (దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసిన) కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లు స్వాగతం పలుకుతున్నాయి. ప్రకృతి అందాలతో పాటు మత సామరస్యాలకు ప్రతీకగా ఇక్కడ ఆలయాలు నిలుస్తున్నాయి. ఆలయాలు సందర్శకులను భక్తి పారవశ్యంలోకి తీసుకువెళ్తాయి.

- కేపీ పాలెం బీచ్ ప్రాంతంలో సుమారు 20 ఏళ్ల క్రితం ఆర్‌సీఎం మిషనరీ సంస్థ వేళాంకణీ మాత ఆలయాన్ని సుందరంగా నిర్మించింది. ప్రతి ఏటా ఏప్రిల్‌లో వేళాంకణీ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.
- సముద్రం నుంచి కొట్టుకొచ్చిన వేంకటేశ్వర స్వామి విగ్రహానికి స్థానికులు ఆలయం నిర్మించారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వేంకటేశ్వర స్వామి, పాండురంగస్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు.
- పేరుపాలెం సౌత్ శివారున సముద్రం – ఉప్పుటేరు కలిసే ప్రాంతాన్ని సీ మౌత్ అంటారు. దీనిని మోళ్లపర్రు బీచ్‌గా, కనకదుర్గ బీచ్‌గా పిలుస్తారు. ఈ బీచ్‌లో మరో విశేషమేమిటంటే రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదిగా 54 అడుగుల అభయాంజనేయ విగ్రహం చూపురులను కట్టిపడేస్తుంది. దీంతో పాటు మత్స్యనారాయణ స్వామి, షిర్డీ సాయి బాబా, పాండురంగ స్వామి ఆలయాలున్నాయి.
- టూరిజం శాఖ ఆధ్వర్యంలో మోళ్లబీచ్‌లో రిసార్ట్స్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాక ప్రైవేటు వ్యక్తులు కూడా రిసార్ట్స్ ఏర్పాటు చేశారు.





కేపీపాలెం బీచ్‌లో దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ కాంస్య విగ్రహం, టూరిజం శాఖ రిసార్ట్స్

బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం



బీచ్‌ల సందర్శనానికి వచ్చే పర్యాటకుల దృష్ట్యా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సిబ్బందిని రప్పించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. బారికేడ్లు దాటి వెళ్లకుండా గజ ఈతగాళ్లను, సిబ్బందిని నియమిస్తున్నాం. మద్యం తాగిన వారిని బీచ్ ప్రాంతంలోకి రాకుండా కట్టడి చేస్తాం. తీరం పొడవునా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాం. సందర్శకులు తమ వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులకు సహకరించాలి.

పేరుపాలెం బీచ్‌లో మృత్యుఘంటికలు

నరసాపురం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందిన ప్రాంతం పేరుపాలెం బీచ్. ఈ బీచ్‌లో గత దశాబ్దన్నర కాలంలో 200 మంది వరకు ప్రమాదవశాత్తు మృతి చెందారు. వీరంతా యువకులే. రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన ఈ బీచ్ శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభంతో పర్యాటకులతో కళకళలాడనుంది. ఈ నేపథ్యంలో బీచ్‌లో భద్రతపై దృష్టిపెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. కార్తీకమాసం నెలరోజులో సుమారు 3 లక్షలు మంది ఈ బీచ్‌ను సందర్శిస్తుంటారు.

అండర్ కరెంట్!

పేరుపాలెం, కేపీపాలెం, మోళ్లపర్రు బీచ్‌ల్లో తరచూ ప్రమాదాలే. ఈ ప్రాంతంలో సముద్రంలో గుంటలు, గుంటలుగా ఉంటాయని, దీంతో అలలు పెద్దపెద్దగా వచ్చినప్పుడు కాళ్ల కింద ఇసుక విపరీతంగా కోతకు గురవుతుంది. దీనినే నిపుణులు అండర్ కరెంట్‌గా పేర్కొంటారు. కాళ్ల కింద ఇసుక కోతకు గురైనప్పుడు సముద్రంలో ఉన్నవారు తమ శరీరంపై నియంత్రణను కోల్పోతారు. అలలకు కొట్టుకుపోతారు. ఆ సమయంలో మద్యం సేవించి ఉంటే ప్రాణాలపై ఆశలు వదులు కోవాల్సిందే. 2013లో అయితే నాటి సబ్‌కలెక్టర్ రొనాల్డ్‌రాజ్ పేరుపాలెం బీచ్‌ను మూసేయాని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేస్తారా?

గత ఐదేళ్లలో బెల్ట్‌షాపులు లేకపోవడంతో పేరుపాలెంబీచ్ వద్ద మద్యం అందుబాటులో ఉండేదికాదు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం తీరగ్రామాలను మొత్తం బెల్ట్‌షాపులతో నింపేసింది. ఈ ఏడాది బీచ్ మొత్తం మద్యం ఏరులై పారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనన్న గుబులు ప్రజలను వెంటాడుతోంది. బీచ్‌లో మద్యం సేవించడం, పేకాట సర్వసాధారణమయ్యాయి. బీచ్‌కు వచ్చే ప్రేమజంటలను బెదిరించి, వారి నుంచి బంగారు వస్తువులను కాజేసే ముఠాల ఆగడాలు అనేకం గతంలో వెలుగుచూశాయి. ఈ ముఠాల ఆగడాలు మరింత పెరిగే అవకాశం ఉంది. బీచ్‌లో అసాంఘిక చర్యలకు అడుకట్ట వేస్తారా? మద్యం మత్తు దరిచేరకుండా చేస్తారా? అనేది చూడాలి. రెండేళ్ల క్రితం రెవెన్యూ, పోలీసు శాఖలు బీచ్‌లో డేంజర్‌జోన్లు సూచిస్తూ హోర్డింగ్స్ ఏర్పాటు చేశాయి. ఇప్పుడూ అదీలేదు.



యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న స్నేహితులు (ఫైల్)

తస్మాత్ జాగ్రత్త

కేపీ పాలెం బీచ్‌లో స్నానాలకు దిగి గల్లంతైన ఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. దీంతో ప్రతి ఏటా కార్తీకమాసం నెల రోజులపాటు తీరం నుంచి వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాటిని దాటి వెళ్లకుండా గజ ఈతగాళ్లను, పోలీసులను నియమిస్తారు. సముద్ర స్నానానికి దిగే వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పరిహారం కూడా ఉండదు

సముద్రంలో గత పదేళ్లలో ఇప్పటి వరకు 28 మంది మృతదేహాలు లభ్యం కాలేదు. మృతుల విషయంలో పోలీసులు 174 సెక్షన్ క్రింద, అనుమానాస్పద మృతి కేసు నమోదు చేస్తారు. బీచ్‌లో చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి పరిహారం కూడా లభించదు. మృతదేహాలు లభ్యంకాకపోతే ఇన్సూరెన్సులు వంటి సదుపాయాలు కూడా వర్తించవు.

తణుకులో వ్యక్తి దారుణ హత్య

- జెడ్పీ హైస్కూల్ ఆవరణలోనే ఘటన
- టీడీపీ నేతపైనే అనుమానాలు



కాకర్ల దుర్గారావు మృతదేహం

తణుకు: తణుకు పట్టణంలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక సజ్జాపురంలో నివాసం ఉంటున్న కాకర్ల దుర్గారావు (35)ను గుర్తు తెలియని వ్యక్తులు తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హత్య చేశారు. హైస్కూల్ ఆవరణలో గత మూడు రోజులుగా బాణసంచా విక్రయించారు. గురువారం రాత్రి వరకు బాణసంచా విక్రయాల అనంతరం ఈ ఘటన జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు దుర్గారావును చెట్టుకు కట్టేసి కొట్టినట్టు తెలుస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున స్కూల్ ఆవరణలో మృతదేహం ఉందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, క్లూస్ టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ ఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడి భార్య అలివేలు మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఎన్ కొండయ్య పర్యవేక్షణలో ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పదం

దుర్గారావు హత్యోదంతం పలు అనుమానాలకు తావిస్తోంది. తణుకు హైస్కూల్ ఆవరణలో గురువారం రాత్రి 11 గంటల వరకు బాణసంచా వ్యాపారులు, యువకులు సంచరించారు. మరోవైపు ఈ వ్యవహారంపై వాట్సాప్ ద్వారా పంపిన మెస్సేజ్ తాజాగా చర్చనీయాంశంగా మారింది. దుకాణదారుల నుంచి డబ్బుల వసూళ్లు, దుకాణాల ఏర్పాటు వంటి అంశాలను పర్యవేక్షించిన టీడీపీ నేత హస్తం ఉందని మెస్సేజ్ సారాంశం కాగా, ఈ వ్యవహారంలో ఇప్పటికే నలుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లను ఇంటింటికీ సరఫరా చేసే దుర్గారావు ఎక్కడ పని ఉంటే అక్కడ చేస్తూ ఉంటాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. స్కూల్ ఆవరణలో చెత్త తొలగించాలని అడిగిన టీడీపీ నేతను డబ్బులు ఇవ్వాలని కోరాడని, ఈ క్రమంలోనే ఆయన అనుచరులు దుర్గారావుపై దాడి చేశారంటూ గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్‌లో మెస్సేజ్ ఫార్వర్డ్ చేయడంపైనా పోలీసులు దృష్టి సారించారు. ఈ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కొండయ్య వెల్లడించారు.

ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్‌లో భీమవరం క్రీడాకారులు

భీమవరం: స్థానిక అనసూయ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ముగ్గురు క్రీడాకారులు ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ సాధించారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. క్లాసికల్, బ్లిట్జ్ విభాగాల్లో అముదాలపల్లి శరణ్ 1405, 1467, ర్యాపిడ్ విభాగంలో కంతేటి జాసిత్‌వర్మ 1551, బ్లిట్జ్ విభాగంలో అముదాలపల్లి శివ కార్తీక్ 1479 రేటింగ్ పాయింట్స్ సాధించారని వివరించారు. దీంతో ఇంటర్నేషనల్ చెస్ రేటింగ్ సాధించారని కిషోర్ వివరించారు.

పంచారామ క్షేత్రాలకు పోలీస్ బందోబస్తు

భీమవరం: కార్తీక మాసం సందర్భంగా సముద్ర తీర ప్రాంతాల్లో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. భక్తులు శైవ ఆలయాలకు, ఘాట్ల వద్ద స్నానాలు చేయటానికి వచ్చినప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఘాట్ల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న, లోతుగా ఉన్నచోట్ల స్నానాలు ఆచరించవద్దని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముఖ్యమైన ఘాట్ల వద్ద, గోదావరి నదీ పరివాహక తీర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటిస్తూ నదీ స్నానాలు ఆచరించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పీ భక్తులకు సూచించారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి



పట్టాలపై సిద్ధూ మృతదేహం

తణుకు: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. తణుకు రైల్వే అవుట్ పోలీసులు కథనం ప్రకారం.. తణుకు పాతవూరుకు చెందిన చిగురుపల్లి జయచంద్ర నాగవినయ్ అలియాస్ సిద్ధూ (22) తణుకులోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. అయిదు నెలలుగా కాకినాడలోని పోలీసు శిక్షణ తీసుకుంటున్నాడు. దీపావళికి సొంతూరు వచ్చిన సిద్ధూ గురువారం రాత్రి తల్లి రేవతితో స్నేహితుల ఇంటికి వెళ్లి బాణసంచా కాల్చుకుని శుక్రవారం ఉదయాన్నే కాకినాడ వెళతానని చెప్పాడు. శుక్రవారం గుర్తు తెలియని రైలు ఎక్కిన సిద్ధూ తణుకు శివారులోని గౌతమి సాల్వెంట్స్ వద్ద రైలు పట్టాలపై జారి పడిపోయాడు. రైల్వే అవుట్ పోలీసులు సిద్ధూ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. సిద్ధూ తల్లి రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ కేసు దర్యాప్తు చేపట్టారు.

పాస్టర్ల వ్యక్తిగత సమాచార సేకరణపై ఆగ్రహం

నరసాపురం: ప్రభుత్వ ప్రోద్బలంతో కొన్నిరోజులుగా అధికారులు పాస్టర్ల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారని నరసాపురం నియోజకవర్గానికి చెందిన పాస్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక స్టేషన్‌పేటలోని చర్చి వద్ద రెవరెండ్ వై.రూబెన్ ఆధ్వర్యంలో పాస్టర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రూబెన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతమంది పాస్టర్లకు డబ్బులిచ్చారో తెలిపాలని ఎవరో సమాచార హక్కు చట్టం ద్వారా అడిగారని చెబుతూ అధికారులు కొన్నిరోజులుగా పాస్టర్లను అనేక ప్రశ్నలు అడుగుతున్నారని తెలిపారు. సొంత స్థలంలో చర్చి కట్టారా? ఎంతకాలం నుంచి పాస్టర్లుగా పనిచేస్తున్నారు? గత గవర్నమెంట్ ఎంత సొమ్ము ఇచ్చింది అని అడుగుతున్నారని వివరించారు. కొంత వ్యక్తిగత సమాచారంపైనా ఆరా తీస్తున్నారని వాపోయారు. దీనిని పాస్టర్లు పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. దీనిపై నరసాపురం సబ్‌కలెక్టర్, డీఎస్పీలకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎ.శ్యాంబాబు, జి.శ్యామ్, ఈదా జాషువా, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పడాల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు పేరిచర్ల భార్గవ రామరాజు, కోటి విజయ్ కిషోర్, చెన్నారెడ్డి సతీష్, యర్రా అంజనేయస్వామి, ఆకుల సతీష్, మాధురి, సంతప్, అంబికా, కార్తీక్, శృతి, రత్నాజీ, అమృత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పడాల గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో సర్వర్ల సమస్య లేకుండా రాష్ట్ర కోఆర్డినేటర్‌తో చర్చించి పరిష్కరించామన్నారు. మోదుగ గుంట, కొండ్రుప్రోలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని తనిఖీ చేసిన తహసీల్దార్

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు అందిస్తున్న కందిపప్పు పంపిణీని తహసీల్దార్ దశిక వంశీ శుక్రవారం తనిఖీ చేశారు. మొబైల్ వాహనం ద్వారా సక్రమంగా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో 24 నంబర్ రేషన్‌షాపును తనిఖీ చేసారు. ఈనెల కందిపప్పు నూరు శాతం వచ్చినందున తెల్లరేషన్‌కార్డుదారులకు కిలో రూ. 67లకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ మురళి, వీఆర్వో ఉష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆళ్వార్‌దాస్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పదంకుమార్ గుప్తా వాకర్స్ భవనంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సుంకర అళ్వార్‌దాస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అళ్వార్‌దాస్ జీవిత విశేషాలను వెల్లడించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే రీతిలో అళ్వార్‌దాస్ వాకర్స్‌లో స్ఫూర్తి నింపి చిరస్మరణీయంగా నిలిచారని తెలిపారు. కోశాధికారి మల్లారెడ్డి సారధి, కేవీ చలం, గ్రంధి సత్యనారాయణ, రాగిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

నాయకులకు కాసులు.. విద్యార్థులకు కష్టాలు

- పాఠశాల ఆవరణలోనే బాణసంచా దుకాణాలు
- ఎక్కడికక్కడే చెత్త వదిలేసిన వ్యాపారులు
- ముడుపుల పేరుతో అధికార పార్టీ నాయకుల వసూళ్లు
- ముక్కున వేలేసుకుంటున్న సామాన్యులు


బాలుర ఉన్నత పాఠశాలలో వదిలేసిన చెత్తాచెదారం

తణుకు: నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. సాక్షాత్తు పట్టణ నడిబొడ్డులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణే వేదికగా చేసుకుని వ్యాపారాలు సాగించారు. ఒకపక్క వంద పడకల ప్రభుత్వాసుపత్రి, మరో పక్క సుమారు 2వేల మంది చదివే పాఠశాల ఆవరణ, పాఠశాల ఆవరణ చుట్టూ ప్రైవేటు ఆస్పత్రులు అయినా ఇదేంటి అని అడిగే సాహసం ఎవరూ చేయలేదు. కారణం దుకాణాల నిర్వహణకు అధికార పార్టీకు చెందిన మాజీ కౌన్సిలర్ చక్రం తిప్పారు. వ్యాపారులనుంచి భారీ ఎత్తున ముడుపులు తీసుకుని దందా కొనసాగించారు. రెవెన్యూ, పోలీసు, ఫైర్ అధికారులంతా తమ చేతుల్లోనే ఉన్నారంటూ ఎవరైనా అడ్డుకుంటే మేం చూసుకుంటామనే ధోరణి ప్రదర్శించారు. చివరికి వ్యాపారాలు ముగిశాయి. రూ. లక్షల్లో ముడుపులు అధికార పార్టీ నేతలే పంచుకున్నారు. అయితే ఇప్పుడు పాఠశాల ఆవరణ మొత్తం చెత్తతో నిండిపోవడంతో విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి.

నిబంధనలు అతిక్రమించి...

దీపావళి వచ్చిందంటే చాలు స్థానిక వార్డు నాయకులకు పండగలా మారింది. దుకాణాల నిర్వహణ పేరుతో వ్యాపారుల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు వసూలుచేసి నిర్వహణ, అధికారులకు మామూళ్లు పేరుతో వసూలు చేస్తున్న వీరు మిగిలిన సొమ్ములు తమ జేబుల్లో వేసుకుంటున్నారు. గతంలో మాదిరిగానే మరోసారి నిబంధనలు అతిక్రమించిన నాయకులు ఒకొక్కరి నుంచి రూ. 24 వేలు చొప్పున వసూలు చేశారు. మొత్తం 32 మంది నుంచి వసూలుచేసిన నాయకులు ఏకంగా జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలోనే అనుమతులు ఇచ్చేశారు. గతంలో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమయంలో వ్యాపారుల నుంచి వసూలు చేసిన మొత్తంలో కొంత పాఠశాల అభివృద్ధికి వినియోగించేవారు. అయితే ఈ సారి ఇలాంటి వ్యవహారాలేవీ కుదరబోవని ముందుగానే వెల్లడించి వచ్చి న మొత్తాన్ని అధికార పార్టీ కూటమి నాయకులు తమ జేబుల్లో వేసుకున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. బాణ సంచా దుకాణాల ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన మాజీ వార్డు కౌన్సిలర్ అధికారులకు ముడుపులిచ్చేది లేదని చెప్పడంతో నిబంధనలు అతిక్రమిస్తున్నప్పటికీ చోద్యం చూస్తూ ఉండాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే వ్యాపారాలు అయ్యాక స్కూలు ఆవరణ మొత్తం చెత్తమయంగా మారడంతో కనీసం అటువైపు ఎవరు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

క్రీడాకారులకు రోటరీ చేయూత


సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: తమిళనాడులో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులకు తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 10 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల నుంచి సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన 20 మంది విద్యార్థులను అభినందించారు. అనంతరం వారికి అవసరమైన క్రీడా దుస్తులను అందజేశారు. క్లబ్ కార్యదర్శి కలారి సిద్దార్ధ రాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్, సీనియర్ రోటరీ సభ్యులు జేఎస్ సుబ్రహ్మణ్యం, వంగూరి హనుమంతరావు, యర్రంశెట్టి బాబూరావు, పూర్వ అధ్యక్షుడు బసవ రామకృష్ణ, జీ సుధాకర్, రోటరీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దింపు కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


తణుకులో కార్మికశాఖ అధికారి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

తణుకు అర్బన్: దింపు కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దింపు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం తణుకు కార్మికశాఖ అధికారి బి.లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది దింపు కార్మికులు చేతివృత్తులపై ఆధారపడి స్వయం ఉపాధితో వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. దింపు వృత్తి ప్రమాదకరమైనదని, చెట్లు ఎక్కేటప్పుడు దిగేప్పుడు ప్రమాదాలు జరిగి మృత్యువాతపడడం, శాస్వత వికలాంగులుగా మారుతున్న ఘటనలు జరుగుతున్నాయని కావున ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ఆదుకోవాలని కోరారు. ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు, శాస్వత వికలాంగత్వం ఏర్పడిన కార్మికులకు రూ. 5 లక్షలు, 45 సంవత్సరాల వారికి రూ. 5 వేలు పింఛను మంజూరు చేయాలని కోరారు. సబ్సిడీతో కూడిన రుణాలు ఇప్పించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలులో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జన్ని మహాలక్ష్మి, జోగి సత్యనారాయణ, కోమటి వెంకటేశ్వర్లు, చేబ్రోలు అయ్యప్ప, కాసకాని సురేష్, జోగి మెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి నీటి నిల్వలే దోమల వ్యాప్తికి ఆవాసాలు


తణుకులో ఫ్రైడే డ్రైడే ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: చిన్నపాటి నీటి నిల్వలే దోమల వ్యాప్తికి ఆవాసాలని జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కేంద్రం సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని కప్పల వెంకన్న సెంటర్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే, కీటకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. దోమ పుట్టుకకు చెక్ పెట్టగలిగితే వ్యాధులను నివారించుకోవచ్చని స్పష్టం చేశారు. ఇండ్లపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులపై మూతలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, గృహాల్లో రిఫ్రిజిరేటర్స్, వాటర్ కంటైనర్లలో ఉండే నీటిని తరచూ మార్చుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణల్లో తాగేసిన కొబ్బరిబొండాలు, టైర్లు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ సామగ్రిని నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గృహాల ఆవరణల్లో మొక్కల కుండీలు, రుబ్బు రోళ్లలో ఉన్న నీటి నిల్వలను స్వయంగా తొలగింపజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్రైడే డ్రైడే ర్యాలీలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు టి.లక్ష్మీకాంతం, ఎస్.స్వర్ణకుమారి, ఆశ కార్యకర్తలు కె.ఝాన్సీ పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు సర్దార్ పటేల్ కృషి


తణుకులో ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: భారతదేశంలోని అన్ని ప్రైవేటు సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసి దేశాన్ని ఐక్యం చేసిన మహానుభావుడు సర్దార్ పటేల్ తణుకు మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి చెప్పారు. శుక్రవారం సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో పట్టణంలో జాతీయ ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ సమైక్యతకు సర్దార్ పటేల్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినీలతో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కేవీ శ్యామలదేవి, సీహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు.

భారతీయత భావం పెంచిన పటేల్


తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో పటేల్ జయంతి కార్యక్రమంలో వీసీ కె.గోపాల్

తాడేపల్లిగూడెం: భిన్నమైన సంస్కృతులు, అనేక భాషలు అనేక ప్రాంతాలు ఉన్న మన దేశంలో భారతీయులంతా ఒక్కటేననే భావం తీసుకొచ్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నారు. ఏక్తా దివాస్ సందర్భంగా గురువారం ఉద్యానవర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీ కె.గోపాల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారతీయతను కాపాడిన ఉక్కుమనిషి పటేల్ అని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్సు ఎస్.సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకులో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


తణుకులో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

తణుకు: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని తణుకులో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత తణుకులో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ అక్కమాంబ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని యూనియన్ సెక్రటరీ అనంత విక్రమ్ ఎగురవేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్ద యూనియన్ నాయకులు ఏఐటీయూసీ పతాకాన్ని అందుకూరి శ్రీనివాస్ ఎగురవేశారు. ఈసందర్భంగా అనంత విక్రమ్, అందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో తొలి కేంద్ర కార్మిక సంఘంగా ఆవిర్భవించిన ఏఐటీయూసీ త్యాగపూరిత పోరాటాలు ఫలితంగానే నేటి కార్మిక చట్టాలు అన్నారు. ఉద్యమ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా సవరించి కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లు తేవడం జరిగిందన్నారు. ఏఐటీయూసీ 105 ఏళ్ల ఉద్యమ పోరాట స్ఫూర్తితో 44 కార్మిక చట్టాల పునరుద్ధరణకు ఉద్యమించాలన్నారు. ఏఐటీయూసీ కార్మిక సంఘాల నాయకులు అట్రు వెంకట్రావు, యరమోలు శ్రీధర్, కరుటూరి ప్రసాద్, శెట్టి పాపారావు, ఎం.రాధాకృష్ణ, అయిశెట్టి రుద్ర కిషోర్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు జయంతి సందర్భంగా గొల్లగూడెం రామాలయం అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. పిల్లలకు పాదరక్షలు, ఆట వస్తువులు, బిస్కెట్లు, పెన్సిల్స్ అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు చీరలు అందజేశారు. మాజీ జిల్లా గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు, ప్రవీణ్ కృష్ణ, సింధు తదితరులు ఉన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు



తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న వీసీ కె.గోపాల్

తాడేపల్లిగూడెం: ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని ఉద్యానవర్సిటీలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రరాష్ట్ర అవతరణ కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించి, శ్రీరాములు త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ నారం నాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు సందర్భంగా శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొర్లేపర శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఘనంగా నివాళ్లులర్పించారు. అధ్యక్షుడు రాము, సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, కోశాధికారి బోగవిల్లి రమేష్, ఆలపాటి సత్యనారాయణ, కొత్త శివ, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది


తణుకు టౌన్: వెంకట్రాయపురం పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తెలుగు వారి ప్రత్యేక గుర్తింపుకోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం ఎప్పటికీ చిరస్మరణీయమని తణుకు వెంకట్రాయపురం పాఠశాల హెచ్‌ఎం పెదపాటి గోపాలకృష్ణ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్మాజీ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకులపై దాడులను అరికట్టాలి

తణుకు టౌన్ : రజక వృత్తి చేసుకునే మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను నివారించాలని, రజకులకు రక్షణ చట్టం తక్షణమే అమలులోకి తీసుకురావాలి ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో జరిగిన రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి మీసాల రాము అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన రజక వృత్తిదారునికి వృద్ధ్యా పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీపై రజక వృత్తికి అవసరమైన బొగ్గును సరఫరా చేయాలని, రూ. 2 లక్షలను సబ్సీడీతో కూడిన రుణాలుగా అందజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మీసాల నరశింహమూర్తి, ధనరాజు, నాగరాజు, రాంపండు, ప్రసాద్, అన్నవరం, నాని తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభకనబర్చిన గురుకుల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈ విషయాన్ని శుక్రవారం ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ద్వారకాతిరుమలలో ఈ సైన్స్ ఫెయిర్ జరిగిందన్నారు. ప్రపంచంలోని అన్ని రంగాలు డ్రోన్లపై ఏ విధంగా ఆధారపడ్డాయో విద్యార్థులు వివరించి అందరి మన్ననలు పొందారన్నారు. తద్వారా జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సాంఘీక సంక్షేమ పాఠశాలల జిల్లా సమన్వయాధికారిణి ఎస్.భారతి, ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే.జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్‌లు అభినందించారు.

6వ తేదీలోగా ఎమ్మెల్సీ ఓట్లకు దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లిగూడెం రూరల్: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు ఓటు హక్కు కోసం ఈ నెల 6వ తేదీలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2021 నవంబరు 1వతేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులుగా పేర్కొన్నారు. డిగ్రీ ఎక్కడ పూర్తి చేసినా, వారి సాధారణ నివాసం ఎక్కడ ఉంటే అక్కడ తహసీల్దార్, ఎంపీడీవో, విద్యాశాఖ అధికారి, మున్సిపల్ అధికారులకు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా మతోద్ధారణ దినోత్సవం

పెంటపాడు: గూడెం టీచర్స్ కాలనీలో గురువారం మతోద్ధారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఘ సంస్కర్త మార్టిన్ లూథర్ విగ్రహానికి ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జీసెస్ బిలీవర్స్ యూనియన్(జేబీయు) అధ్యక్షుడు మానుకొండ డల్లా మాట్లాడుతూ ప్రతి ఏటా అక్టోబర్ 31న క్రైస్తవులంతా మతోద్ధారణ దినోత్సవం ఏటా జరుపుకొంటారన్నారు. మార్టిన్ లూథర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు మీసాల శామ్యూల్, పాస్టర్‌లు బజయా అవినాష్, బజక్ రాజేంద్ర, బ్రదర్ లాల్‌నెహ్రూ, బిషప్ డి. ప్రకాష్, టీచర్‌లు మానుకొండ బేబీ సరోజని, శ్రీలక్ష్మి, ఆదర్శ సోషల్ సర్వీస్ అధ్యక్షులు రొక్కాల నాగబుజ్జి, చంటిబాబు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

ఇరగవరం: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సభ్యులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు ఇరగవరం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎం సుందరరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ గత ఐదునెలల నుంచి ఇసుకలేక భవననిర్మాణాలు ఆగిపోవడంవల్ల కార్మికులకు ఉపాధిని కోల్పోయారని అన్నారు. సిమెంటు, ఐరన్ మెటల్ నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల కొనుగోలు శక్తిలేక కార్మికులు పస్తులతో రోడ్డుమీద పడ్డారని, వారిని ఆదుకోవాలని అన్నారు.బల్ల శ్రీనివాసు, అంకం కృష్ణమూర్తి, ఎల్లం తిరుపతి సత్యనారాయణ, రాసమల్ల శ్రీనివాసు, ఎర్రంశెట్టి లక్ష్మీనారాయణ, బడేటి భాస్కరరావు, బల్ల ఆదినారాయణ పాల్గొన్నారు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో శుక్రవారం స్థానిక 12వ వార్డులో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలు జరిగాయి. పరిసరాలు పరిశీలన, ర్యాలీలు నిర్వహించారు. వై.వీ.లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్య నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్య భద్రత పొందవచ్చున్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమలద్వారా వచ్చే వ్యాధులను అరికట్టా లన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, భవాని, దుర్గ, కోమలి, లక్ష్మి, సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

ఏక్తా దివస్ ర్యాలీ

తాడేపల్లిగూడెం: దేశసమైక్యతకు పాటుపడిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని గురువారం ఏక్తా దివాస్ సందర్భంగా నిట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబి.వీరేష్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ కీలక పాత్ర పోషించారన్నారు. అసోసియేట్ డీన్ కిరణ్‌తీపర్తి, తదితరులు ఉన్నారు.